క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండల పరిధి వల్లెరవారిపల్లె గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాఘమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి పలు నదుల గంగ జలాలు, బావి నీళ్లతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచితరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా మూలవిరాట్

గోపవరం : మండల పరిధి బుచ్చనపల్లె గ్రామంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ పంచమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పాఠశాల తనిఖీ



పాఠశాలలో విద్యార్థుల హాజరు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్

పోరుమామిళ్ల : కొండుగారిపల్లె అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పిల్లల హాజరు, అంగన్వాడీలో పౌష్టిక ఆహారం గురించి ఆరా తీశారు. పిల్లల హాజరు పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా పరిషత్ గ్రాంటు కింద మంజూరయిన రూ.5 లక్షలతో జరుగుతున్న రక్షణ గోడ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు.


బీసీ కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీ కులగణన చేపట్టాలని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. 141 బీసీ కలాలు అన్ని ఏకమై టీడీపీ విజయానికి కృషి చేశాయన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ బీసీలకు రక్షణ చట్టం తెస్తామని, బీసీ కులగణన చేస్తామని మేనిఫెస్టోలో చేర్చిందన్నారు. అది ఇంకా కార్యరూపం దాల్చలేదన్నారు. బీసీల రక్షణ చట్టం తెచ్చి, బీసీల భద్రతకు పెద్ద పీట వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి దేవేంద్రుడు, ఉపాధ్యక్షులు జీసీ పుల్లయ్య, భాస్కర్, ట్రెజరర్ సంటయ్య, నాగయ్య, పరమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం



రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల : ఉపాధ్యాయుల్లో రామకృష్ణారెడ్డి అరుదైన వ్యక్తి అని, విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేశారని ఎంఈఓ కాశయ్య పేర్కొన్నారు. రామేశ్వరం ఎంపీపీ పాఠశాల హెడ్మాస్టర్ ముత్తుముల రామకృష్ణారెడ్డి శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను శనివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ రామకృష్ణారెడ్డికి విలక్షణమైన వ్యక్తిత్వం ఉందని, ఎక్కడ పని చేసినా తన సొంత డబ్బు ఖర్చు పెట్టి పాఠశాలను అభివృద్ధి చేయడం, సుందరీకరించడం చేశారన్నారు. అందుకే ఆయనను జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోకులం.. రుణపాశం

గోకులం రుణపాశంగా మారింది. మూడు నెలలైనా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అధికారుల ఒత్తిడితో లబ్ధిదారులు అప్పు చేసి షెడ్లు నిర్మించారు. ఇప్పుడు నిధులు విడుదల చేయకపోవడంతో.. వారు ఆందోళనకు గురవుతున్నారు.

- మూడు నెలలైనా అందని బిల్లులు
- అప్పు చేసి నిర్మించుకున్న వైనం
- ఆందోళనలో లబ్ధిదారులు



లబ్ధిదారుడు నిర్మించుకున్న గోకులం షెడ్డు



ఖాజీపేట మండలం పుల్లూరులో గోకులం షెడ్డు ప్రారంభోత్సవంలో అధికారులు, నేతలు (ఫైల్)



మైదుకూరు మండలం శివాపురంలో గోకులం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ (ఫైల్)

చాపాడు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం గోకులం పథకం పేరుతో పాడి రైతులకు పాడి, పశుపోషణ షెడ్లు మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా 875 గోకులం షెడ్లు మంజూరు కాగా.. ప్రతి మండలానికి 25 చొప్పున కేటాయించారు. ఉపాధి ఏపీఓ, ఎంపీడీఓ, పశు సంవర్ధకశాఖ ఏడీ, పశు వైద్యాధికారి, వెలుగు ఏపీఎంతో కూడిన కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేసింది. అయితే వీటిని పూర్తిగా అధికార పార్టీకి చెందిన వారికే మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల కూటమి ఎమ్మెల్యేలు చెప్పిన వారికే మంజూరు చేసినట్లు.. అధికారులు కూడా అనధికారికంగా చెబుతుండటం గమనార్హం. గోకులం కింద 2 ఎనుములకు సంబంధించిన షెడ్డుకు రూ.1.15 లక్షలు, 4 ఎనుముల షెడ్డుకు రూ.1.85 లక్షలు, 6 ఎనుముల షెడ్డుకు రూ.2.30 లక్షల చొప్పున నిధులు మంజూరవుతాయి. వీటిలో అధికంగా 6 ఎనుముల షెడ్లనే లబ్ధిదారులు నిర్మించుకున్నారు. ఇందులో రైతు 10 శాతం చెల్లించాల్సి ఉంది. ఇదే క్రమంలో గొర్రెలు, మేకల షెడ్లకు 20 ఉంటే రూ.1.30 లక్షలు, 50 ఉంటే రూ.2.30 లక్షలు మంజూరవుతాయి. వీటికి రైతు వాటా 30 శాతం ఉంటుంది. గోకులం షెడ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను అక్టోబరు నెలలో మొదలుపెట్టి నవంబరు, డిసెంబరు నాటికి పూర్తి చేశారు.

షెడ్లను ప్రారంభించినా అందని బిల్లులు

రాష్ట్ర వ్యాప్తంగా మంజూరైన గోకులం షెడ్లను ఉపాధి హామీ సిబ్బంది.. లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకువచ్చి నిర్మాణాలు పూర్తి చేయించారు. గోకులం షెడ్ల నిర్మాణంలో మూడు దశల్లో బిల్లులు లబ్ధిదారులకు అందాల్సి ఉంది. అయితే బిల్లులు పడకపోయినప్పటికీ నిర్మాణాలు పూర్తి చేయాలని, మూడు బిల్లులు ఒకేసారి పడతాయని చెప్పి నిర్మాణాలను పూర్తి చేయించారు. జనవరి 10, 12వ తేదీల్లో షెడ్యూల్ ఏర్పాటు చేసిన అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మండల, గ్రామ స్థాయి నాయకులు అధికారులతో కలిసి గోకులం షెడ్లను అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా రూ.30–40 కోట్ల వరకు బిల్లులు అందాల్సి ఉందని ఉపాధి హామీ పథకం అధికారులు చెబుతున్నారు. మూడు నెలలు గడుస్తున్నా బిల్లులు అందలేదని, అధికారుల ఒత్తిడి వల్ల అప్పులు చేసి షెడ్లను నిర్మించుకున్నామని, షెడ్లను ప్రారంభించి మూడు వారాలవుతున్నా డబ్బులు అందలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఉపాధి ఏపీడీ ఏమన్నారంటే..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పాడి రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లకు బిల్లులు అందకపోవడంపై ఉపాధి హామీ ఏపీడీ జె.సుబ్బారెడ్డిని వివరణ కోరగా.. ప్రభుత్వం ఇప్పటి వరకు స్లాట్‌లను ఓపెన్ చేయలేదని, అవి ఓపెన్ అయినప్పుడు బిల్లులు పడతాయని, ఇప్పటి వరకూ పడలేదని ఇకపై ఎప్పుడైనా పడొచ్చని తెలిపారు.

బడ్జెట్‌తో భారత వికాసం వేగవంతం

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ భారత వికాసం వేగవంతం చేసేలా ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వికసిత్‌భారత్ లక్ష్యంగా ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. వృద్ధిని వేగవంతం చేయడం, సమగ్ర అభివృద్ధి, ప్రైవేట్ రంగ పెట్టుబడులు, కుటుంబ మనోభావాలను పెంచడం, భారత దేశంలో పెరుగుతున్న మధ్య తరగతి వ్యయ శక్తిని పెంపొందించడం అని వివరించారు. అంతేకాకుండా రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి పెంచడం ద్వారా రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దువ్వూరు(చాపాడు) : దువ్వూరు మండలంలోని చిన్న సింగనపల్లె వద్ద శనివారం రాత్రి రెండు బర్రెలు పోట్లాడుతుండగా.. అదే దారిలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న రవి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. చల్లబసాయపల్లె గ్రామానికి చెందిన రవి టీవీఎస్ మోటార్ సైకిల్‌లో పాలు పాల కేంద్రంలో పోసేందుకు వెళుతుండగా.. చిన్న సింగనపల్లె సమీపంలో రెండు బర్రెలు పోట్లాడుతూ మోటార్ సైకిల్‌పై పడ్డాయి. ఈ ప్రమాదంలో రవికి తీవ్ర గాయాలు కాగా పొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి



పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం లలితా సహస్రనామ పారాయణం, సౌందర్య లహరి పారాయణం చేశారు. వేకువజామున ముక్తి రామలింగేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి, చండీ మాతకు విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కర్నూలుకు చెందిన ప్రొఫెసర్ శ్రీదేవి, శ్రీమాత సత్సంగ్ ఆధ్వర్యంలో భక్తులు సామూహికంగా ఉదయం 9.30 నుంచి లలితా సహస్రనామ పారాయణం, సౌందర్యలహరి పారాయణం లోకకల్యాణార్థం పఠించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మొరాయించిన పింఛన్ల పంపిణీ సర్వర్

ఇబ్బంది పడ్డ సిబ్బంది, లబ్ధిదారులు



సర్వర్ పని చేయక పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

చాపాడు : ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సర్వర్ మొరాయించింది. ఉదయం 6 గంటల ముందు నుంచే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో.. గ్రామ సచివాలయ సిబ్బంది తెల్లవారుజాము నుంచే ఆయా సచివాలయాల పరిధిలోని గ్రామాలకు చేరుకున్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టగా సర్వర్ మొరాయించింది. రెండు గంటల పాటు పింఛన్ పంపిణీలో అంతరాయం ఏర్పడింది. దీంతో పింఛన్ దారులు గుంపుగా చేరి పింఛన్ డబ్బులు కోసం ఎదురు చూశారు. ఈ క్రమంలో కొందరు పనులకు వెళ్లిపోగా, మరికొందరు పడిగాపులు కాసి పింఛన్ డబ్బులు తీసుకున్నారు. దీంతో సచివాలయ సిబ్బందితోపాటు పింఛన్‌దారులు విసుగు చెందారు. వచ్చే నెల అయినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ల పంపిణీ సర్వర్ పని చేయాలని వారు కోరుకుంటున్నారు.

రాచమల్లు మునిరత్నమ్మకు ఘన నివాళి



మునిరత్నమ్మ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



మునిరత్నమ్మకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తల్లి రాచమల్లు మునిరత్నమ్మ భౌతిక కాయాన్ని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ సందర్శించి నివాళి అర్పించారు. అలాగే ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి ఘన నివాళి అర్పించారు.

ముగిసిన అంత్యక్రియలు : రాచమల్లు మునిరత్నమ్మ అంత్యక్రియలు ఆదివారం ఉదయం ముగిశాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సోదరుడు కిరణ్‌కుమార్‌రెడ్డిలను వారు పరామర్శించారు.

దివ్యాంగుల పింఛన్‌దారులకు నోటీసులు

బ్రహ్మంగారిమఠం : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పింఛన్‌ల తొలగింపులో భాగంగా.. బ్రహ్మంగారిమఠం మండలంలో మొదటి విడతగా దివ్యాంగుల పింఛన్‌దారులకు నోటీసులు ఇచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను ఎలాగైనా తొలగించాలనే ఉద్దేశంతో.. మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో దాదాపు 300 మంది వివిధ రకాల వికలాంగుల పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేశారు. కడప, ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మళ్లీ పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీఓ కార్యాలయం నుంచి నోటీసులు ఇచ్చారని పింఛన్‌దారులు సోమవారం తెలిపారు. నోటీసు అందుకున్న పింఛన్‌దారుడు తప్పకుండా వెళ్లాలని, లేనిపక్షంలో వచ్చే నెల నుంచి పింఛన్ తీసివేయడం జరుగుతుందని తెలుపుతున్నట్లు వారు వాపోయారు. రెండో విడతలో ఆధార్ కార్డులలో వయసు మార్చుకున్న వారు ఉంటారని పేర్కొంటున్నారు. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం పింఛన్లను తగ్గించే పనిలో ఉందని స్థానికులు అంటున్నారు.

3న తలనీలాల సేకరణకు వేలం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో తలనీలాల సేకరణ కోసం ఈ నెల 3వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.రామలింగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 3వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని బద్వేలు దేవదాయ శాఖ కార్యాలయంలో అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి ఈ నెల 26, 27వ తేదీల్లో రెండు రోజుల పాటు తలనీలాలు సేకరించుకునేందుకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే లంకమల రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి ఈ నెల 26, 27వ తేదీల్లో రెండు రోజుల పాటు టెంకాయలు విక్రయించుకునేందుకు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిపాజిట్ నగదు రూపంలో చెల్లించాలని, హెచ్చు పాటదారుడు వేలంపాట ముగిసిన వెంటనే డిపాజిట్‌తో కలిపి మొత్తం నగదు చెల్లించి రసీదు పొందాలన్నారు. అలా చెల్లించని పక్షంలో పాటదారుని డిపాజిట్‌ను అపరాధ రుసుం కింద దేవస్థానం ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం దేవదాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తే ప్రోత్సాహం



కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు ప్రమాదానికి గురైన క్షతగాత్రులను 1 గంట లోగా సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణదాతలు కావాలని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. జాతీయ భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా ఆస్పత్రిలో వైద్యాధికారులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ మనం వెళ్తున్నప్పుడు ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడి కనిపిస్తే మానవత్వంతో వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించాలన్నారు. 1 గంట లోపు ఆస్పత్రికి తరలిస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన వారి వివరాలను పోలీసులకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. గతంలో క్షతగాత్రులకు సహాయం చేసిన వారి వివరాలు చెప్పాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు మోటర్ వెహికల్ చట్టంలో మార్పులు చేశారన్నారు. బాధితుల్ని ఆస్పత్రిలో చేర్పించిన వారికి నగదు బహుమతితోపాటు, కలెక్టర్‌చే ప్రశంసా పత్రం అందజేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాల్లో వెళ్తున్నప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, ఎంవీఐ నారాయణనాయక్, ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కె.గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, ఏఓ ఓబులేసు, స్టాఫ్ నర్సులు, ప్రజలు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే పక్షవాతానికి మెరుగైన చికిత్స



వృద్ధుడికి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హరికిశోర్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : సరైన సమయంలో గుర్తించి నాలుగున్నర గంటల్లోపు ఆస్పత్రికి వస్తే పక్షవాతానికి మెరుగైన చికిత్స అందించవచ్చని మెదడు, వెన్నముక, నరముల వైద్య నిపుణుడు డాక్టర్ ఆర్.హరికిశోర్‌రెడ్డి తెలిపారు. హరికిశోర్ న్యూరో, స్పైన్ అండ్ ఈఎన్‌టీ కేర్ హాస్పిటల్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా హాస్పిటల్‌లో శనివారం ఉచిత ఓపీ నిర్వహించారు. ఓపీకి వచ్చిన వారికి 50 శాతం రాయితీతో రక్తపరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు చేశారు. 250 మంది ఓపీలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికిశోర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో 75 వెన్నుపూస, 50 మెదడు సంబంధిత సర్జరీలను పూర్తి చేసినట్లు చెప్పారు. తమ హాస్పిటల్‌లో న్యూరో సర్జరీకి 24 గంటల వైద్య సదుపాయం కలదన్నారు. తలకు దెబ్బలు, దీర్ఘకాలం తలనొప్పి, నడుంనొప్పి, మెడనొప్పి, బీపీ వల్ల తలలో రక్తస్రావం తదితర సమస్యలకు మెరుగైన చికిత్సను అందిస్తామని తెలిపారు. చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ యస్. లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ చెవిలో చీము కారుట, వినికిడి సమస్యలు, చెవిలో శబ్దం రావడం, ముక్కులో గాలి ఆడకపోవడం, ముక్కులో నీరు కారడటం, గొంతు బొంగరు పోవడం తదితర సమస్యలకు తమ ఆస్పత్రిలో ప్రత్యేకంగా చికిత్స అందిస్తామన్నారు.

ఘనంగా సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో శ్రీసీతారామ,లక్ష్మణ, ఆంజనేయస్వామి మూలవిరాట్

తొండూరు : మండలంలోని బూచుపల్లెలో శనివారం శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టను వేద పండితులు రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు.

ఆసక్తికరంగా బండలాగుడు పోటీలు

బండలాగుడు పోటీలకు రాయలసీమ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి సీనియర్ ఎద్దులు వచ్చి బండను లాగాయి. ఈ పోటీలలో నంద్యాల జిల్లా గుంపరమనుద్దిన్నే మండలం చౌటపల్లె, కుందురు గ్రామాలకు చెందిన మార్తల చంద్రఓబుళరెడ్డి, రాం భూపాల్‌రెడ్డి ఎద్దులు 2258 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.లక్ష నగదును పొందాయి. మైదుకూరు పట్టణానికి చెందన కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎద్దులు 2256 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన ఎం.నాగయ్య ఎద్దులు 2022 అడుగులు లాగి మూడవ స్థానంలో నిలిచాయి.

వైఎస్సార్‌సీపీ ఫీజు పోరును విజయవంతం చేయండి

పోస్టర్లు విడుదల చేసిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం బద్వేలు పట్టణం నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా కూటమి సర్కారు విద్యార్థులను వేధిస్తోందన్నారు. పేద పిల్లలపై కక్ష సాధింపు చర్యలకు దిగిన చంద్రబాబు ప్రభుత్వం మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయిబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదన్నారు. ఫీజులు కట్టకపోవడంతో కాలేజీల నుంచి కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను వెళ్లగొడుతుండటంతో దిక్కుతోచని స్థితిలో చదువులు మధ్యలో ఆగిపోతున్నా కూటమి సర్కారు చోద్యం చూస్తోందన్నారు. కాలేజీలకు వెళ్లాల్సిన విద్యార్థులు పొలాల బాట పట్టి కూలీ పనులు చేసుకుంటున్న దుస్థితి ఏర్పడిందన్నారు. పేద పిల్లలు పెద్ద చదువులు సాకారం చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకువచ్చి వైఎస్సార్ నిరుపేద ఇళ్ల నుంచి డాక్టర్, ఇంజినీర్లు, సైంటిస్టులు తయారు కావాలన్న సమున్నత లక్ష్యంతో నాడు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్సార్ మరణానంతరం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిన ప్రభుత్వాలు, చంద్రబాబు సర్కార్ 2014–19 మధ్యలో ఈ పథకానికి తిలోదకాలు ఇచ్చిందన్నారు. ఉద్దేశ పూర్వకంగా బకాయిలు పెట్టి కాలేజీ యాజమాన్యాలను, విద్యార్థులను చంద్రబాబు ఇబ్బందులు పాలు చేశారని అన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ బాటలో మరో రెండడుగులు ముందుకేసి 93 శాతం మంది పిల్లలకు మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన పిల్లల తలరాతలు మార్చాలంటే అది ఒక్క చదువుతోనే సాధ్యమని నమ్మారన్నారు. జగన్ ప్రభుత్వం ఆ దిశగా పరిపాలనలోనూ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది వైఎస్సార్‌సీపీ హయాంలో మాత్రమేనని తెలిపారు. గత విద్యా సంవత్సరం డిసెంబర్ త్రైమాసికం వరకు రూ.12,609 కోట్లు ఒక్క విద్యా దీవెనకే ఖర్చు చేశారని, ఇది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన పథకాలకే రూ.18 వేల కోట్ల వరకు ఖర్చు చేశారన్నారు.

కూటమి పాలనలో..

నేడు అమ్మఒడి, ఇంగ్లిషు మీడియం, 3వ తరగతి నుంచే టోఫెల్, 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్ రద్దు, సీబీఎస్‌ఈ, సీబీఎస్‌ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం, 8వ తరగతి పిల్లలకు ట్యాబులు, బైజూస్ కంటెంట్ లేవని, నాడు–నేడు పనులు అటకెక్కాయని పేర్కొన్నారు. ఇలా అన్నింటిని రద్దు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కూటమి పాలన మళ్లీ కష్టాలు తెచ్చి పెట్టిందన్నారు. వసతిదీవెన, విద్యాదీవెన నిలిపేసి డిగ్రీ, ఇంజినీరింగ్, డాక్టర్ చదువుల కలలను నీరుగార్చిన చంద్రబాబు ప్రభుత్వం నాలుగు త్రైమాసాలుగా ఫీజు బకాయిలు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. కూటమి సర్కారు వసతి దీవెన కూడా ఇవ్వకుండా విద్యార్థులపై కక్ష సాధించిందన్నారు. సుమారు రూ.2800 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్, మరో రూ.1100 కోట్లు లాడ్జింగ్, బోర్డింగ్ ఖర్చుల కింద వసతి దీవెన బకాయిలు పెండింగ్ మొత్తంగా రూ.3900 కోట్లకు బకాయిలు పేరుకుపోయాయని అన్నారు.

నిందలేయడం సరికాదు

2019లో దిగిపోతూ రూ.2800 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, మధ్యాహ్న భోజనం బకాయిలు రూ.148 కోట్లు పెట్టి వెళ్లిన చంద్రబాబు.. వాటిని జగన్ ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని తీర్చింది తప్ప నిందలేస్తూ కూర్చోలేదని పేర్కొన్నారు. ఇప్పుడు గద్దెనెక్కాక దెయ్యాలు వేదాలు వల్లించినట్లు పెండింగ్ బకాయిలపై చంద్రబాబు, లోకేష్ వ్యాఖ్యలు ఉన్నాయని, ఫీజు బకాయిలు వెంటనే చెల్లించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు, నాయకులు పుత్తాశ్రీరాములు, ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, మాజీ ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీరాములు, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, క్లాస్–1 కాంట్రాక్టర్ టి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'వీరశేఖర్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవం'

కడప కార్పొరేషన్ : రెండు రోజుల క్రితం అన్నదాత సీడ్స్ యజమాని గోసుల వీరశేఖర్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారం, దురుద్దేశ పూరితమని అప్పటి సీటీవో–2 విజయలక్ష్మి ఒక ప్రకటనలో ఖండించారు. 2015 సంవత్సరం జూలై 10వ తేదీన అన్నదాత సీడ్స్ వారు రూ.2,52,000 విలువ చేసే వరి పంటను ఏపీ 04 టీడబ్ల్యూ 1829 నంబర్ గల వాహనంలో రవాణా చేసినందుకు.. 5 శాతం ట్యాక్స్ రూ.12,600, ట్యాక్స్‌పై రెండింతల జరిమానా రూ.25,200 విధించడం జరిగిందన్నారు. అదే నెల 13వ తేదీ మొత్తం రూ.37800ను ప్రభుత్వ ఖజానాలో జమ చేయడం జరిగిందన్నారు. వాట్ చట్టం -2005 ప్రకారం జరిమానాను అధికంగా రెండు సార్లు మాత్రమే విధించగలమని, ఆ ప్రకారమే విధించామన్నారు. వీరశేఖర్‌రెడ్డి ఆరోపించినట్లుగా నాలుగు సార్లు జరిమానా విధించలేదన్నారు. పదేళ్ల తర్వాత ఆరోపించిన ఈ విషయం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. దీనిపై న్యాయపరంగా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైలవరం జలాశయంపై రాకపోకలు బంద్

జమ్మలమడుగు : ఫిబ్రవరి నుంచి మైలవరం జలాశయం కట్టపై రాకపోకలను నిలిపివేసినట్లు డీఈ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం జలాశయం గేట్ల వద్ద స్పిల్‌వే పనులు చేపడుతుండటంతో పనులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.